క్లుప్తంగా

శ్మశాన వాటిక భూమిని కాపాడాలని వినతి

తుర్కయంజాల్: తొర్రూర్ రెవెన్యూ బ్రాహ్మణపల్లి సర్వే నంబర్ 191లోని శ్మశాన వాటిక భూమి కబ్జాకు గురవుతుందని, ఆ భూమిని గుర్తించి ప్రహరి నిర్మించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవ రెడ్డి కోరారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొహెడలోని సురవరం సుధాకర్ రెడ్డి కాలనీలో ఇళ్ల నిర్మాణం కోసం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా రూ.5 లక్షల నిధులను కేటాయించాలని కోరారు. సంఘం ఉపాధ్యక్షుడు చల్లా నారాయణ రెడ్డి, నాయకులు బాలయ్య, నరేందర్ గౌడ్, జగన్ మోహన్ రెడ్డి, అంజమ్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి మూడు అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డివిజన్ స్థాయి ప్రజావాణికి మూడు అర్జీలు వచ్చాయని ఆర్డీఓ అనంతరెడ్డి తెలిపారు. భూ సమస్యలపై రెండు, ఉపాధిహామీ కూలీ పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఒక దరఖాస్తు వచ్చిందని పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారులకు అర్జీలను పంపి, సమస్యల పరిష్కారానికి కృషిచేయనున్నట్లు పేర్కొన్నారు.

గుంతల రోడ్డుకు మోక్షం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: గుంతల రోడ్డుకు మోక్షం లభించిందని ఉప్పరిగూడ పీఏసీఎస్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌లు శ్రీనివాస్, భిక్షపతిలు అన్నారు. చింతపల్లిగూడ నుంచి రాందాస్‌పల్లి మీదుగా కొహెడ రోడ్డు పనులు రూ.10 కోట్ల 50 లక్షలతో 600 మీటర్ల సీసీరోడ్డు పనులు సోమవారం రాందాస్‌పల్లి వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో రోడ్డు పనులు ప్రారంభం అయ్యాయని తెలిపారు. గ్రామశాఖ అధ్యక్షుడు రాజు, నరేష్, జంగారెడ్డి, నవీన్‌యాదవ్, శేఖర్ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం



నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కందుకూరు: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ సరిత ఆధ్వర్యంలో ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో 16 ఎంపీటీసీ స్థానాలకు గాను 51,706 మంది ఓటర్లు, 92 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఓటరు జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని కోరారు. తప్పులను సరిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలి

చేవెళ్ల ఏడీఏ సురేశ్‌బాబు



డీలర్లతో మాట్లాడుతున్న ఏడీఏ సురేశ్‌బాబు

మొయినాబాద్: ఫర్టిలైజర్ షాపుల డీలర్లు ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలని చేవెళ్ల ఏడీఏ సురేశ్‌బాబు అన్నారు. సోమవారం మొయినాబాద్ రైతు వేదికలో ఫర్టిలైజర్ షాపుల డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువుల విక్రయ ధరల్లో తేడా లేకుండా ఉండాలన్నారు. బిల్ పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, యూరియా స్టాక్ ఎంట్రీని తప్పనిసరిగా ఈ-పాస్ యంత్రంలో నమోదు చేయాలని సూచించారు. రైతులు యూరియాను అధికంగా వాడొద్దని.. అది నేల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. రైతులు సాధారణ యూరియాకు బదులు నానో యూరియా వాడాలని సూచించారు. రైతులకు సరిపడా ఎరువులు అందిస్తున్నామని.. ఒకేసారి రైతులు రావడంతో ఇబ్బంది అవుతుందని.. టోకెన్లు ఇచ్చి అందజేస్తున్నామన్నారు. మండల వ్యవసాయాధికారి అనురాధ, ఏఈఓలు సునీల్ ఉన్నారు.



ఇబ్రహీంపట్నం త్రిశక్తి అలయానికి వెళ్లే దారిలో ట్రాన్స్‌ఫార్మర్, పోల్స్‌కు అల్లుకున్న తీగలు



ఖానాపూర్‌లో ఇళ్ల మధ్య కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్, అల్లుకున్న తీగలు



త్రిశక్తి అలయానికి వెళ్లేదారిలో మరో ట్రాన్స్‌ఫార్మర్ దుస్థితి

నిర్లక్ష్యం.. ప్రాణ సంకటం

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ప్రజలు, మూగజీవాలకు సంకటంగా మారింది. జనసంచారంలో కరెంట్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లకు పెనవేసుకున్న చెట్ల కొమ్మల తీగలు, ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలతో ప్రమాదం ఉంది. కంచెలేని వాటితోనూ ముప్పు పొంచి ఉంది.

జనవాసంలో పొంచిఉన్న ముప్పు
- కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు, కప్పేసిన చెట్లపొదలు
- మూగజీవాల మృత్యువాత
- తరచూ సరఫరాకు అంతరాయం
- పట్టించుకోని ట్రాన్స్‌కో సిబ్బంది

ఇబ్రహీంపట్నం: మున్సిపాలిటీ పరిధి సాగర్ రహదారి నుంచి త్రిశక్తి ఆలయం, పలు ఫంక్షన్ హాళ్లకు వెళ్లే దారిలో విద్యుత్ స్తంభాలు, నియంత్రికల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. కొన్నింటికి ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. కొమ్మలు అల్లుకుపోయాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. నియోజకవర్గ కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే.. మారుమూల ప్రాంతాలు, వ్యవసాయ బావుల వద్ద పరిస్థితి చెప్పలేనిది. ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డు వెనుక పవన్‌పురి కాలనీలో చెట్ల కొమ్మలు కరెంట్ తీగలకు తగలుతున్నాయి. వర్షాలు పడుతుండటంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తెచ్చారు. అయినప్పటికీ ఆ సమస్యకు పరిష్కారం లభించడం లేదు.

ఖానాపూర్‌లో..

ఖానాపూర్ జనసంచారంలోని ఇరుకు రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచాయి. పొదలు ఏర్పడి తీగలకు అల్లుకుపోయాయి. దీంతో కొన్ని మూగ జీవాలు మృత్యువాత పడ్డాయి. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఇదే విషయమై విజ్ఞప్తి చేస్తూ.. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇక్కడి నుంచి తరలించాలని కోరినా ఎవరూ స్పందించడం లేదని స్థానికులు ఆరోపించారు. ఏదైనా ప్రమాదం జరగకముందే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొమ్మల తొలగింపు పేరుతో..

ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంట్ తీగలకు తగిలే చెట్ల కొమ్మలు, పారిన తీగల తొలగింపు పేరుతో గడిచిన కొన్ని నెలలుగా అధికారులు.. గంటల తరబడి విద్యుత్ సరాఫరాను నిలిపివేస్తున్నారు. ఈ కారణాన్ని చూపుతూ అంతరాయం అంటూ ఓ ప్రకటన విడుదల చేస్తున్నారు. దీంతో గంటల తరబడి సరఫరా లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. అయినప్పటికీ అల్లుకున్న నిర్లక్ష్యం వీడటం లేదు.

ప్రకృతి వనంలా..



ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ పోల్స్ చుట్టూ అల్లుకుపోయిన పొదలు, తీగలు ప్రకృతి వనంలా తలపిస్తున్నాయి. అసలే వానా కాలం. ప్రమాదం ఉందని తెలిసినా వాటిని తొలగించడంలో విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదు.

– బానుచందర్, ఇబ్రహీంపట్నం

వర్షాలు పడుతున్న వేళ



వర్షాలు పడుతున్నాయి. విద్యుత్ స్తంభాలు, తీగలకు చెట్ల కొమ్మలు తగులుతున్నాయి. వీటి వలన ప్రమాదం ఉందని సంబంధిత అధికారులు తెలుసు. గాలివానతో కూడిన వర్షాలు పడినప్పుడల్లా సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సమస్యను పరిష్కరించాలి.

– అశోక్, ఇబ్రహీంపట్నం

విప్లవ ధ్రువతార ఐలమ్మ

- ఆమె పోరాటం స్ఫూర్తిదాయకం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కడ్తాల్: తెలంగాణ సాయుధ పోరాటంలో వీరనారి చాకలి ఐలమ్మ పాత్ర మరువలేనిదని, ఆమె ధైర్య సాహసాలు ఎందరికో స్ఫూర్తి దాయకమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధి రావిచేడ్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన ఐలమ్మ విగ్రహాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సామాజిక న్యాయం కోసం ఉద్యమించిన మహనీయుల్లో వీర వనిత ఐలమ్మ ఒకరని గుర్తుచేశారు. అలాంటి వారిని నిత్యం పూజించాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన ధీరవనిత అన్నారు. తెలంగాణ ప్రజల తెగువను, పోరాట పటిమను, స్ఫూర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన విప్లవ ధ్రువతార అని కొనియాడారు. కార్యక్రమంలో రజక అభివృద్ధి సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమూర్తి, మార్కెట్ చైర్ పర్సన్ యాటగీత, సంఘం గ్రామ అధ్యక్షుడు రవికుమార్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశగుప్తా, సంఘం నాయకులు మల్లేశ్, శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ పాల్గొన్నారు.



ఐలమ్మ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తదితరులు

ఐక్యతతోనే సంఘం అభివృద్ధి

కడ్తాల్: గౌడ సంఘం అభివృద్ధి, కులస్తుల సమస్యల పరిష్కారానికి పార్టీలకు అతీతంగా కృషి చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు మాలే మల్లేశ్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కంఠమహేశ్వర స్వామి ఆలయంలో సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు యాదయ్యగౌడ్, వెంకటయ్యగౌడ్ ఆధ్వర్యంలో.. మండల అధ్యక్షుడు మల్లేశ్ సమక్షంలో గౌడ పట్టణ యువజన సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శివగౌడ్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, శేఖర్, మహేశ్, ప్రధాన కార్యదర్శులుగా అనిల్, శ్రీను, నరేశ్, జగదీశ్, కార్యదర్శులుగా చిన్నా, సందీప్, సంయుక్త కార్యదర్శులుగా మహేందర్, శివ, కోశాధికారిగా కార్తీక్, సహాయ కార్యదర్శులుగా నాగులు, హరీశ్, కార్యవర్గ సభ్యులుగా కార్తీక్, మల్లేశ్, రాజశేఖర్, అంజయ్యను నియమించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు యాదయ్యగౌడ్, వెంకటయ్య, గణేశ్, కేశవులు, శ్రీరాములు, శ్రీనివాస్, యాదయ్య, అంజయ్య, జగదీశ్ తదితరులు ఉన్నారు.



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న సంఘం నాయకులు

సీలింగ్ భూములను కాపాడండి



ఎమ్మెల్యే మల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

పేదలకు న్యాయం చేయండి: గ్రామస్తులు

అబ్దుల్లాపూర్‌మెట్: పేదలకు చెందాల్సిన సీలింగ్ భూములు ఆక్రమణకు గురయ్యాయని, వాటిని కబ్జాదారుల చెర నుంచి విడిపించి పేదలకు న్యాయం చేయాలని మజీద్‌పూర్ వాసులు కోరారు. సోమవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 161,162,163లలోని సుమారు 14 ఎకరాల సీలింగ్ భూములను ఓ విద్యాసంస్థ ఆక్రమించిందని ఆరోపించారు. అదే విధంగా సర్వే నంబర్ 74,88,89లోని నకిలీ పత్రాలతో చేపట్టిన లావాదేవీలపై విచారణ చేపట్టి, తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. 35 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూములకు పట్టా పాసు పుస్తకాలను ఇప్పించాలన్నారు. సర్వే నంబర్ 34,35లోని భూదాన్ భూమిని ఓ రియల్ ఎస్టేట్ సంస్థ కబ్జాచేసి, మామిడితోటను వేసిందని, ఆ భూమిని స్వాధీనం చేసుకుని, ఇళ్లు లేనివారికి స్థలాలు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేశ్, రమేష్, సురేష్‌రెడ్డి, జంగయ్య, వేంరెడ్డి, సీలింగ్ రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యానికి కార్మికుడి బలి

మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: ప్రభుత్వ నిర్లక్ష్యానికి పారిశుద్ధ్య కార్మికుడి నిండు ప్రాణం బలైందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి జైపాల్ యాదవ్ అన్నారు. ములుగు పురపాలక సంఘంలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తూ.. ఐదు నెలలుగా జీతం అందక ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న మహేశ్ చిత్రపటానికి కార్మికులతో కలిసి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సకాలంలో వేతనం అందక కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహ్మారెడ్డి, బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, వెంకటేశ్, నర్సింహ, అంజి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

తుర్కయంజాల్: జన చైతన్య కాలనీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అంబోజి అనిత, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వర్ రెడ్డి, ఇంద్రావత్ బుజ్జి, ప్రధాన కార్యదర్శిగా వీణ, కార్యదర్శులుగా సునీత, స్వాతి, సుష్మ, సంయుక్త కార్యదర్శిగా శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారిగా లావణ్య, సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా లోహిత్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా జలందర్ రెడ్డిలను నియమించారు. అనంతరం వీరిని మాజీ కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ ఘనంగా సన్మానించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

తుక్కుగూడ: సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా మూసిన మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ, జెన్నాయిగూడ శ్రీలక్ష్మీనర్సింహాస్వామి, శ్రీనగర్ శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయాలను సోమవారం అర్చకులు సంప్రోక్షణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గర్భగుడిలో ఉన్న దేవతామూర్తులకు అభిషేకం, అలంకరణ చేశారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల పంపిణీ

కొందుర్గు: మండలంలోని ఉమ్మెంత్యాల గ్రామంలో సోమవారం నాయకులు లబ్ధిదారులకు కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గత పదేళ్లుగా రేషన్‌కార్డుల కోసం పేద ప్రజలు ఎన్నో అవస్థలు పడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పేదలందరికీ కార్డులు పంపిణీ చేస్తోందన్నారు. ఇందులో భాగంగా ఉమ్మెంత్యాలలో 14 మందికి కొత్త రేషన్‌కార్డులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేందర్‌రెడ్డి, రామచంద్రయ్య, లక్ష్మయ్య , మల్లేశ్, పాండు, అంజయ్య, అమర్‌నాథ్‌రెడ్డి, సాయికుమార్, వీరేశ్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం



ఆమనగల్లు: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కుసుమ మాధురి



యాచారం: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాధారాణి

- రాజకీయ పక్షాలు సహకరించాలి
- ఓటరు జాబితాల అభ్యంతరాలను స్వీకరిస్తాం
- ఎంపీడీఓలు కుసుమమాధురి, రాధారాణి

ఆమనగల్లు: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగానే ఉన్నామని, అందుకు రాజకీయ పక్షాల నాయకులు సహకరించాలని ఎంపీడీఓ కుసుమమాధురి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఓటరు, పోలింగ్ కేంద్రాల జాబితాలపై వివిధ రాజకీయ పార్టీల నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అన్ని గ్రామాల్లో జాబితాలను ప్రదర్శనకు పెట్టామని, వాటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం ఆయా సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. సలహాలు, సూచనలు పాటిస్తామని పేర్కొన్నారు.

యాచారంలో..

యాచారం: స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని, ప్రభుత్వ ఆదేశాలు రావడమే ఆలస్యమని ఎంపీడీఓ రాధారాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీటీసీ, జెడ్పీటీసీల ఎన్నికలకు సంబంధించి ఓటరు, పోలింగ్ స్టేషన్ల ముసాయిదాపై రాజకీయ పక్షాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటరు, పోలింగ్ కేంద్రాల జాబితాల గురించి మాట్లాడారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నాయకులు సహకరించాలని కోరారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి శ్రీలత, నాయకులు విజయనాయక్, తాండ్ర రవీందర్, మస్కు నర్సింహ, గౌర నర్సింహ, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



ఆమనగల్లు: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు



యాచారం: నక్కర్తమేడిపల్లిలో..

ఆమనగల్లు: పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు టీచర్లను విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో సంక్షేమ అధికారి నేనావత్ గోపాల్, ప్రధానోపాధ్యాయురాలు విమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు.. యూరియా అందిస్తాం



మార్కెట్ యార్డులో క్యూకట్టిన రైతులు

ఆమనగల్లు: యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని, సింగిల్ విండోల ద్వారా వినియోగం మేరకు అందజేస్తామని చైర్మన్ గంప వెంకటేశ్ అన్నారు. సోమవారం పట్టణంలోని మార్కెట్‌యార్డు ఆవరణలో రైతులకు ఒక్కొక్కరికి 2 బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు. అంతకు ముందు రైతులకు చైర్మన్ గంప, ఎస్‌ఐ వెంకటేశ్‌ల సమక్షంలో సింగిల్ విండో సీఈఓ దేవేందర్ కూపన్లు అందజేశారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్‌ముదిరాజ్

కందుకూరు: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే సబితారెడ్డి కృషి చేస్తున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముచ్చర్ల నుంచి ఊట్లపల్లి మధ్యలో ఉన్న రహదారిని స్థానికులతో కలిసి ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే కృషితో ఆ రహదారి నిర్మాణానికి రూ.2.72 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఈ సందర్భంగా వారు హర్షం వ్యక్తం చేశారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలను పక్కను పెట్టాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేదంర్‌రెడ్డి, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు దామోదర్‌రెడ్డి, బండ నర్సింహ, పి.అశోక్, కంద పెద్దనర్సింహ, సదానంద్‌గౌడ్, మోహన్, నీలం రామకృష్ణ, మల్లేశ్, రాజు, బొర్ర రాజు, చెన్నారెడ్డి, ఆనంద్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



ముచ్చర్ల రహదారిని పరిశీలిస్తున్న నాయకులు

శివాలయ భజన మండలి కమిటీ ఎన్నిక

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలలోని శ్రీ శివాలయ భజన మండలి నూతన కమిటీని సోమవారం జరిగిన ఆ సంఘ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కటికపల్లి శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా సొప్పరి శేఖర్, కుర్నమోని రమేశ్, ప్రధాన కార్యదర్శిగా మణికంఠ, క్యాషియర్‌గా ఉప్పునూతల శివకుమార్‌తో పాటు మరి కొంతమంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఆ ఓటర్లను ఎందుకు తొలగించలేదు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అఖిలపక్షం నాయకులు

ఇబ్రహీంపట్నం: ఓటర్ జాబితాలో అభ్యంతరం తెలిపిన ఓటర్లను ఎందుకు తొలగించలేదని పలువురు నేతలు ఎంపీడీఓను ప్రశ్నించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ వెంకటమ్మ ఆధ్వర్యంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఓటర్ జాబితాపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని కోరినప్పుడు.. ఆదిబట్లకు చెందిన ఓటర్లు ఇతర ప్రాంతాల్లో నమోదై ఉన్నట్లుగా గుర్తించి తెలిపామని, అయినా వాటిని తొలగించలేదన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. సమస్యను ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. నెర్రపల్లి గ్రామానికి చెందిన రెండు ఓట్లు ఇతర ప్రాంతంలో నమోదై ఉన్నట్లు తమ దృష్టికి ఈ సమావేశంలో తీసుకొచ్చినట్లు తెలిపారు. సమావేశంలో సూపరింటెండెంట్ యెల్లంకి జంగయ్యగౌడ్, అఖిల పక్ష నేతలు బుగ్గరాములు, సతీష్‌గౌడ్, శివరాల లక్ష్మయ్య, దమోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.